క్లుప్తంగా

ఆలేడ్‌లో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుద్యాల్: కాంగ్రెస్‌తోనే గ్రామాల సంపూర్ణ అభివృద్ధి సాధ్యమని కొడంగల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో రూ.2.5లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గ్రామస్థులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు, పట్టణాలు, గూడెంలు అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అనంతయ్య, నర్సిములు గౌడ్, అశోక్, నారాయణ గౌడ్, నవీన్, బసప్ప, వెంకటయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నరేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న సీసీ రామచంద్రయ్య

దుద్యాల్: మండల పరిధిలోని హంసంపల్లిలో మహిళా సంఘం గ్రామ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. హంసంపల్లి, నాంచెరుతండాకు సంబంధించిన 11 సంఘాలకు చెందిన ముఖ్య సభ్యులను కమిటీకి ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మొగులమ్మ, కార్యదర్శిగా అమృతమ్మ, కోశాధికారిగా కమలమ్మ, ఉపాధ్యక్షురాలుగా నసీమ బేగం, సహ కార్యదర్శిగా లక్ష్మిలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మొగులమ్మ మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా నడుచుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సీసీ రామచంద్రయ్య, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు ఇస్తున్న ప్రజా ప్రతినిధులు

కొడంగల్: అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా ఈ నెల 19వ తేదీన పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు ఆదివారం ఉదయం బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన కేటీఎస్ విద్యార్థులు వైశాలి, అమూల్యా, వివేక్‌లకు పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి రాజేందర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మక్బూద్ అలీ, ఉపాధ్యాయులు కాశప్ప, నర్సిములు, మణికంఠ పాల్గొన్నారు.

ఆర్. కృష్ణయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్

బంట్వారం: రాజ్య సభ సభ్యుడు ఆర్ కృష్ణయ్యకు కేంద్రంలో మంత్రి పదవి ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో బీసీలకు సంబంధించి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి కృష్ణయ్యకు ఆ శాఖను అప్పగించాలని పేర్కొన్నారు. బీసీ ఉద్యమ నేతగా కృష్ణయ్య దేశ వ్యాప్తంగా బీసీల హక్కుల పరిరక్షణకు జాతీయ స్థాయిలో పోరాటం చేశారని ఆయన గుర్తు చేశారు. కృష్ణయ్యకు కేంద్ర మంత్రి పదవి ఇస్తే బీసీల న్యాయమైన హక్కులను సాధించుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ విషయంపై తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం తరపున త్వరలో ఢిల్లీకి వెళ్లి ప్రధానికి వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతిపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 11గంటలకు రైతులకు ఈ సదస్సు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతిని తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. కావున రైతులు సకాలంలో అవగాహన సదస్సుకు హాజరు కావాలని ఆయన కోరారు.

ఐదేళ్లుగా అసంపూర్తిగానే..!



గ్రామ సంఘం భవనం



అంగన్‌వాడీ సెంటర్‌లో మహిళా సంఘం సమావేశం (ఫైల్)

- పూర్తికాని ఆగిన భవన నిర్మాణం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న పొదుపు సంఘాల మహిళలు, స్థానికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

కుల్కచర్ల: మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తామని పాలకులు ఆయాసభలలో ప్రకటనలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మహిళా సంఘాల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వాలు గ్రామ సంఘం భవనాలను ఏర్పాటు చేస్తున్నాయి. దీంతో వారు ఒక్కచోట చేరి వారి ఆర్థిక అభ్యున్నతికి మహిళా సంఘాల సహకారంతో తీసుకున్న రుణాలు, జమ చేస్తున్న పొదుపుమొత్తం వంటి ఆర్థిక వ్యవహారాలను చర్చించుకునేందుకు గ్రామాల్లో గ్రామసంఘం భవనాలు ఉపకరిస్తున్నాయి. అందులో భాగంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మహిళల సంక్షేమాన్ని గుర్తించారు. వారు సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు గ్రామ సంఘం భవనాలను నిర్మించారు. కానీ కుల్కచర్లలో అట్టి భవన నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం మెండుగా కనిపిస్తుంది. భవన నిర్మాణ పనులు పూర్తి చేయించేందుకు ఏ అధికారి కూడా ముందుకు రావడం లేదు. పట్టించుకోవడం లేదు.

స్లాబ్ వరకు పనులు చేపట్టి..

కుల్కచర్ల మండల కేంద్రంలో సీడీపీ నిధులక్రింద రూ. 5లక్షలతో గ్రామ సంఘం భవనాన్ని నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. కానీ నిధులు సరిపడక పోవడంతో భవన నిర్మాణం పూర్తికాకుండానే ఆగిపోయింది. స్లాబ్ వరకు భవన నిర్మాణ పనులు చేపట్టి నేటికి పూర్తి చేయలేదు. పాలకులు, అధికారులు అట్టి భవన నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో అది నిరుపయోగంగా మారింది. శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు చేపట్టాలంటే మళ్లి కొత్తగా నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఇక ఎమ్మెల్యే సీడీపీ నిధులు, కలెక్టర్ ప్రత్యేక నిధులు కేటాయిస్తే తప్పా మరే ఇతర మార్గాల నుంచి నిధులు మంజూరయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఆ భవన నిర్మాణం పూర్తికాదేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

110 పొదుపు సంఘాలు

కుల్కచర్ల గ్రామంలో 110 మహిళా పొదుపు సంఘాలు ఉన్నాయి. వీటి పర్యవేక్షణకు 3 గ్రామ సంఘాలు ఉన్నాయి. ప్రతి నెల పొదుపు సంఘాల్లోని మహిళలు తీసుకున్న రుణాలు చెల్లించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ సమావేశం ఏర్పాటు చేసుకుని రుణాలు వసూలు, చెల్లింపులు వంటివి నిర్వహిస్తారు. సంఘం భవనం లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చేసేదేమి లేక ప్రభుత్వ బడుల్లోని ఆవరణలో లేదా అదే గ్రామంలో చెట్లకింద సమావేశం ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామంలోని మహిళలందరినీ కో ఆర్డినేట్ చేసేందుకు మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో సెర్ప్ సిబ్బంది గ్రామ సంఘాల ద్వారానే సమన్వయం చేసుకుంటారు. ఇక్కడ అలాంటి సౌకర్యం లేకుండా పోయింది. గ్రామ సంఘం భవనం నిర్మాణ దశలోనే ఆగిపోవడంతో మహిళా సంఘాలు, ప్రతినిధులకు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు, పాలకులు సమస్యను గుర్తించాలి. భవన నిర్మాణా పనులకు నిధులు కేటాయించాలి.

సత్వరమే పూర్తి చేయాలి



గ్రామ సంఘం భవనం లేకపోవడంతో పాఠశాలలోని వరండాలో, చెట్ల క్రింద కూర్చొల్సి వస్తుంది. వర్షాలు పడితే ఎక్కడ సమావేశం ఏర్పాటు చేసుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. తమకంటూ ఒక ప్రత్యేక భవనం ఉంటే సౌకర్యవంతంగా సమావేశాలు ఏర్పాటు చేసుకోవచ్చు. సత్వరమే భవననిర్మాణ పనులు పూర్తయ్యేందుకు నిధులు మంజూరు చేయాలి.

– రాజమ్మ, గ్రామసంఘం అధ్యక్షురాలు, కుల్కచర్ల

పనులు ప్రారంభిస్తాం



గతంలో సీడీపీలో కేటాయించిన రూ. 5లక్షలతో పనులు చేశారు. అధికారులు కేటాయించిన నిధుల మేరకు పనులు చేపట్టారు. మళ్లి మిగిలిన పనులకు నిధులు మంజూరు చేయిస్తే భవననిర్మాణ పనులు ముందుకు సాగుతుంది. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభించి భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తాం.

– మణికుమార్, ఏఈ, పంచాయతీరాజ్, కుల్కచర్ల

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న గురునాథ్‌రెడ్డి

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

కొడంగల్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో కొడంగల్ పట్టణంలోని మార్కెట్ యార్డులో, మండల పరిధిలోని పెద్ద నందిగామ గ్రామంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి ఆదివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, శంకర్ నాయక్, దాము, మునీర్, వినోద్, మిఠాయి రాజు, సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

బంట్వారం: మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షను 27వ తేదీన నిర్వహించనున్నట్లు బంట్వారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్యూలా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. 7వ తరగతి నుంచి పదో తరగతిలో ప్రవేశాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. స్థానిక మోడల్ స్కూల్లోనే ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. ప్రవేశ పరీక్షకు దర ఖాస్తు చేసుకున్న విద్యార్థులు సోమవారం నుంచి వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని బ్యూలా తెలిపారు. పరీక్షా కేంద్రానికి అర్ధగంట ముందు చేరుకోవాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బంట్వారం: పెద్దేముల్ మండలంలోని గాజీపూర్, ఇందూర్, తట్టెపల్లి, బంట్వారం మండలంలోని తొర్మామిడి, బంట్వారం, మర్పల్లి మండలంలోని కల్ఖొడ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మరమ్మతు పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఆలయాల్లో భక్తుల కిటకిట

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. మండల పరిధిలోని అమ్డాపూర్ రక్షమైసమ్మ, కనక మామిడి వేంకటేశ్వర స్వామి ఆలయం, సంగమేశ్వర ఆలయం, హిమాయత్‌నగర్‌లోని స్వామి నారాయణ గురుకుల్ లోటస్ టెంపుల్‌లో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు దేవాలయాల్లో బారులు తీరారు.

సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రతీ ఒక్కరు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9వ మల్లికార్జున కాలనీలోని పార్కులో ఆదివారం కాంగ్రెస్ వార్డు ఇన్‌చార్జి గోదా మాధవులు యాదవ్ సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సేవా భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని సమాజాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం ఖర్చు చేయాలన్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీను, కృష్ణ, ప్రవీణ్, జయ ప్రకాష్, మాణిక్యం, వీరేశం, సత్తయ్య, వెంకటేష్ యాదవ్, శ్రావణ్, శ్రీధర్‌గౌడ్, సందీప్, రంజిత్, అక్షయ్, రజిత, జయ, శ్రీకాంత్, మల్లేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పండుగలు

నందిగామ: పార్టీలకతీతంగా పండుగలు నిర్వహించుకోవడం అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో ఆదివారం మైసమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు శ్రీశైలం, ప్రభాకర్, రవీందర్, కృష్ణ, కుమార్, రాజశేఖర్, నర్సింహ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు నేలకొరిగిన జొన్న పంట



గడ్డమీది గంగారంలోని ఓ పొలంలో నేలకొరిగిన జొన్నపంట

ధారూరు: గాలి, వాన బీభత్సానికి జొన్న పంట నేల కొరిగింది. ఈ సంఘటన ధారూరు మండలంలోని గడ్డమీది గంగారంలో చోటుచేసుకుంది. ఆదివారం రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో శనివారం సాయంత్రం బలమైన ఈదురు గాలులు వీస్తూ భారీ వర్షం కురిసింది. దీంతో చేతి కొచ్చిన పంటలు పాడయ్యాయన్నారు. మండలంలో జొన్నపంట నేలకొరిగిందని రైతులు వాపోయారు. గ్రామంలోని 10 మంది రైతుల 15 ఎకరాల జొన్నపంటకు నష్టం వాటిల్లిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నష్టపోయిన తమ పంటలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

ఆ భూములు ఆలయానికే చెందాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించిన రాజశేఖర్‌రెడ్డి

మోమిన్‌పేట: ఆలయ భూములు ఆలయానికి చెందేల చర్యలు తీసుకోవాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి కేటాయించిన ప్రభుత్వ భూమిని అధికారులు వెంటనే పాసుపుస్తకాలు అందజేయాలన్నారు. అదేవిధంగా ఆలయానికి విరాళంగా ఇచ్చిన పట్టా భూమిని ఇతరులు కబ్జా చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, గ్రామస్తులు దర్శన్‌రెడ్డి, మాణయ్య, శేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల



జినుగుర్తి శ్రీరాములవారి ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన సాగునీరు

తాండూరు రూరల్: జినుగుర్తి అటవీప్రాంతంలోని శ్రీరాముల వారి ప్రాజెక్టు నుంచి ఇరిగేషన్ అధికారులు సాగునీటిని విడుదల చేశారు. ప్రస్తుతం వేసవికాలం దృష్ట్యా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు సాగునీటిని ఆదివారం విడుదల చేశారు. ఈ సాగునీటితో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వేసవికాలంలో పశువులకు తాగునీటికి ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. మరికొందరు కర్ణాటకకు వృథాగా నీరు పారుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

చేవెళ్ల అగ్నిమాపక కేంద్రం అధికారి రవీందర్‌రెడ్డి



పరికరాల ప్రదర్శన నిర్వహిస్తున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది

చేవెళ్ల: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల అగ్నిమాపక కేంద్రం అధికారి (ఎస్ఎఫ్ఓ) ఎన్.రవీందర్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలోని అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం అగ్నిమాపకవారోత్సవాల ముగింపు సందర్భంగా కార్యాలయంలో అగ్నిమాప కేంద్రంలో ఉండే యంత్రపరికాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. వారంరోజుల పాటు పబ్లిక్ స్థలాల్లో, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్, పరిశ్రమలు, సినిమా థియేటర్లు, కాలనీలలో ప్రజలకు అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించామన్నారు. చివరి రోజున కార్యాలయంలో ప్రజలకు అగ్నిమాపక కేంద్రంలో ఉండే యంత్రపరికాలు, వాటి ఉపయోగాల గురించి యంత్రాల ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎదైనా అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ప్రశాంత్‌కుమార్, సాయి, ఎండీ యూనూస్, సురేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



యాలాల: పగిడియాల పాఠశాలలో..



బంట్వారంలో..

దుద్యాల్: మండల పరిధిలోని దుద్యాల్, హకీంపేట్, హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-2009, హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-2007, హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-2008 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని ఒకరినొకరు పలకరించుకున్నారు. కుటుంబ క్షేమ సమాచారం తెలుసుకున్నారు. పాఠశాలలో చేసిన అల్లరిపనులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2005-2006 బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు 19 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు శాలువా కప్పి, పూల మాల వేసి ఘనంగా సత్కరించారు.

యాలాలలో..

యాలాల: మండలంలోని పగిడియాల ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయ బృందాన్ని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒకరినొకరు పలకరించుకొని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పూర్వ విద్యార్థులు ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రాములు, నర్సిరెడ్డి, మొగులయ్య, జైపాల్‌రెడ్డి, గోపాల్, పూర్వ విద్యార్థులు అంజిలయ్య, సరిత, నర్సింహులు, ఆశప్ప, మల్లేష్, వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: 1999, 2000 జెడ్పీహెచ్ఎస్ బంట్వారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరి నొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం వారికి బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అంజిలయ్య, యాదయ్య, నజీర్, బసంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు



కుల్కచర్ల: ముజాహిద్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో..